# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి...

● ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసిన గోళి శ్రీనివాస్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి, నవంబర్30, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రతేక నిధులు కేటాయించి అభివృద్ధి పర్చాలని ఎల్. బి.నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి టీఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి కల్వకుర్తి ప్రాంతాన్ని ఐటీ కారిడార్‌గా ఏర్పాటు చేయాలని, కల్వకుర్తి నియోజకవర్గం గుండా 3జాతీయ రహదారులు అనుసంధానమ వుతున్నాయని, ఐటీ రంగాలను విస్తరింపజేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.



ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసిన టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి

## కృష్ణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ..!

- సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి
- పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- చెక్‌పోస్టు దగ్గర అప్రమత్తంగా ఉండాలి
- ప్రతిరోజు వాహనాల తనిఖీలు నిర్వహించాలి
- రౌడీలు, సస్పెక్ట్స్‌పై నిఘా ఏర్పాటు చేయాలి

**నారాయణపేట,నవంబరు 30 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలోని కృష్ణ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ కె.సత్యనారాయణ వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఉదయం తనిఖీ నిర్వహించారు.ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు పోలీస్ స్టేషన్ పరిశుభ్రంగా ఉంచాలని, వారానికి ఒకసారి శ్రమదానం కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. పోలీసులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని బాధితులు ఏ సమయంలోనైనా పోలీస్ స్టేషన్‌కు వస్తే -మిగతా2లో..



మొక్క నాటుతున్న డీఎస్పీ సత్యనారాయణ

## విద్యారంగానికి... ప్రభుత్వం అధిక ప్రాధాన్యత..

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- దేవరకద్రలో బిసి బాలుర గురుకుల డిగ్రీ కళాశాల ప్రారంభం



దేవరకద్రలో బిసి గురుకుల డిగ్రీ కళాశాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపి, జడ్పీచైర్మన్, ఎమ్మెల్యే

**దేవరకద్ర,నవంబరు 30 ప్రభాతవార్త :** విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. దేవరకద్రలో మంగళవారం జ్యోతిరావుపూలె బిసి బాలుర గురుకుల డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి కళాశాలను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి, ఎంపి ప్రసంగించారు. సమైక్య రాష్ట్రంలో ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాల్లో గతంలో పరిస్థితులు దయనీయంగా ఉండేవన్నారు. పిల్లలు చర్మవ్యాధులతో బాధపడే పరిస్థితి తలెత్తేదన్నారు. పురుగులు పడిన దొడ్డన్నంతోపాటు నీళ్లచారు తినలేక పిల్లలు కన్నీళ్లు పెట్టుకునేవారన్నారు. సమైక్య పాలనలో గత పాలకులు విద్యా వ్యవస్థను సర్వనాశనం చేశారని వారు ఆరోపించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి కెసిఆర్ కెజి నుండి పిజి వరకు కూడా సకల సదుపాయాలతో ఉచిత గురుకులాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. గత 70 ఏళ్లలో పేదలకు మెరుగైన విద్య అందక అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. దేశంలోనే అత్యున్నత గురుకుల విద్యనందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. ఉద్యమ సమయంలోనే ఈ రాష్ట్రానికి ఏంకావాలో మేధోమథనం చేసిన ఉద్యమ నేత ప్రస్తుతం ముఖ్యమంత్రి అయ్యాక వాటిని అమలుచేసి ఊహించని విధంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. కెజి నుంచి పిజి వరకు ఉచిత గురుకుల విద్యనందించడమే ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రధాన సంకల్పమన్నారు. ఆ దిశగానే ముందుకు సాగుతున్నారన్నారు. దేవరకద్రలో పిజి కళాశాలను ఏర్పాటు చేయడానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు.

**విద్యారంగానికి అండగా ప్రభుత్వం... జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే**

విద్యా రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని జడ్పీ చైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు అన్నారు. దేవరకద్రలో బిసి బాలుర గురుకుల డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు ప్రసంగించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులు టిఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూయిస్తుందన్నారు. ఈ సందర్భంగా దేవరకద్రలో బిసి గురుకుల బాలుర డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటిసి అన్నపూర్ణ శ్రీకాంత్, ఎంపిపి రమాశ్రీకాంత్ యాదవ్, టిఆర్ఎస్‌మండల పార్టీ అధ్యక్షులు జెట్టి నరసింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్‌లతో పాటు తహసిల్దార్ జ్యోతి, నాయకులు కొండ శ్రీనివాస్‌రెడ్డి, కొండ భాస్కర్‌రెడ్డి, ఉప్పరి సత్యం, మెడికల్ షాపు రాము తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో బిసి గురుకుల డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## సాగు రైతుకే పోడు భూములపై హక్కు...

- రుణమాఫీ సంగతేమిటి.?
- ప్రభుత్వ హామీలు నేరవేరెదెన్నడు...



సమావేశంలో మాట్లాడుతున్న అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ

**అచ్చంపేట, నవంబర్ 30, ప్రభాతవార్త:** వందల సంవత్సరాల నుంచి భూమినే నమ్ముకొని సాగు చేస్తూ జీవ నం కొనసాగిస్తున్న అడవి బిడ్డల కడుపు కొట్టి పోడు భూములను ప్రభుత్వం ఆక్ర మించుకోవాలని చూస్తూ రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పిలుపుమేరకు పోడు భూముల సమస్యల పరిష్కార దిశగా బుధవారం ఆర్డీఓ కార్యాలయం ముందు చేపట్టిన నిరసన, ధర్నా కార్యక్రమానికి ఆలిండియా కిసాన్ మేళా నాయకులు కోదండరెడ్డి, ఎమ్మెల్సీ రాములునాయక్, రంగారెడ్డి జిల్లా నాయకులు గంగిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి రైతులకు పెద్దపీట వేస్తామని ప్రగల్భాలు పలుకడమే తప్ప రైతులకు చేసిందేమి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చి రైతులకు, ప్రజలకు అండగా ఉంటాని వారు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులను గుప్పిట్లో పెట్టుకొని పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులపై లాఠీ చార్జీలు చేయించడమేమిటని వారు ప్రశ్నించారు. దున్నేవాడిదే భూమి అని, దళితులకు మూడు ఎకరాల భూమిని కల్పించి అభివృద్ధి పరుస్తామన్న మాటలు నీటి మూటలుగానే మిగిలినప్పటికి ఆదివాసులపై లాఠీ జులుం చేయించడం ప్రజాస్వామ్యా అని వారు ప్రశ్నించారు. రెండు పర్యాయాలుగా టీఆర్ఎస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నప్పటికి ఏక కాలంలో రుణమాఫీ చేస్తామని కాలం గడుస్తున్నప్పటి కూడా రుణమాఫీపై స్పష్టత ఇవ్వకుండా రైతులను ఊగిసలాటలో నెట్టుస్తున్నారని వారు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మభ్య పరుస్తున్నారే తప్ప ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నేరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని వారు దుయ్యబట్టారు. ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి రైతులను కార్యాలయాల చుట్టు తిరిగేలా చేస్తూ కాలయాపన చేస్తున్నారే తప్ప రైతు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడానికి మాత్రం వీలు లేకుండా ధరణి వెబ్‌సైట్‌ను మార్చారని వారు పేర్కొన్నారు. ధరణితో సంపన్నులకే లాభం చేకూరుతుంది కానీ సన్న, చిన్న కారు రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 100ల ఎకరాలు ఉన్న గుత్తేదారులకు మాత్రం ధరణితో అధిక లాభం ఉంటే...2,3 ఎకరాలు ఉన్న రైతుల పేరిట ఉన్న భూమి ఆన్‌లైన్ కనిపించకపోవడం వల్ల ఆ భూమి మా పేరిట కల్పించాలని కార్యాలయాల చుట్టు తిరిగి అధికారులకు మొర పెట్టుకున్న ఏండ్లు గడి చిన కూడా రైతుల భూ సమస్యల పరిష్కారం కాకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్న విషయం ప్రభుత్వానికి కనిపించడం లేదా అని వారు ప్రశ్నించారు. రైతు సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అంతకు ముందు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అమ్రాబాద్ సింగిల్‌విండో చైర్మన్ గణేష్, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు సక్రునాయక్, మాజీ ఎంపీపీ రామనాథం, ఉప్పునుంతల, అచ్చంపేట, బల్మూర్, వంగూరు, చారకొండ మండలాల పార్టీ అధ్యక్షులు కట్ట ఆనంద్‌రెడ్డి, నర్సయ్యయాదవ్, మల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పండిత్‌రావు, బాల్‌రాంగౌడ్; నాయకులు మహబూబ్‌అలీ, మస్తాన్, సుధాకర్‌గౌడ్, లక్ష్మినాయక్, సుశీల, ఖాదర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



నిరసన, ధర్నా కార్యక్రమానికి హజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు

## యువత నూతనంగా ఆలోచించాలి..

- తెలంగాణలో ఉపాధి అవకాశాలు పెరిగాయి..
- భిన్నమైన ఉపాధి రంగాలను ఎంచుకోవాలి..
- ఆత్మహత్య చేసుకున్న బిటెక్ విద్యార్థిని లావణ్య కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇళ్లు
- టీఆర్ఎస్‌లో చేరిన 30మంది కార్యకర్తలు
- గ్రామాలు నివాసానికి యోగ్యంగా మారాయి: వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి





ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



పేద గాయకుడు కొండన్నకు ఇంటిస్థలం పత్రాలు అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



రుక్మాకర్‌రెడ్డితో మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి,నవంబరు 30 ప్రభాతవార్త :** 35 ఏళ్లు అమెరికాలో ఉండి వచ్చి ఫామ్‌లో మేకలు పెంచుతున్న రుక్మాకర్‌రెడ్డిని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అభినందించారు. పల్లెనిద్రలో భాగంగా రేవల్లి మండలం తల్పునూరులో పల్లెనిద్ర చేసి బుధవారం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వార్డులలో పర్యటించి ప్రజల ద్వారా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఉపాధి అవకాశాలు పెరిగాయని, భిన్నమైన ఉపాధి రంగాలను ఎంచుకోవాలన్నారు. గ్రామాలు నివాసానికి యోగ్యంగా మారాయని అన్నారు. 35 ఏళ్లు అమెరికాలో ఉండి వచ్చి ఫామ్‌లో మేకలు పెంచుతున్న రుక్మాకర్‌రెడ్డిని మంత్రి అభినందించారు. దళితబంధులో కూడా ఇలాంటి యూనిట్లు చేపట్టవచ్చన్నారు. ఉపాధి అవకాశాలు పెరిగితే గ్రామాలు స్వయంసమృద్ధి సాధిస్తాయన్నారు. ప్రగతికోసమే పల్లెనిద్రలు అన్నారు. ప్రతిగ్రామం, ప్రతి తండాలో పల్లెనిద్ర చేయాలని అధికారులకు సూచించారు. పల్లెనిద్రతో మరుగున పడిన సమస్యలు తన దృష్టికి వచ్చాయని సమస్యల పరిష్కారానికి వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ప్రజలతో మరింత ఎక్కువ మమేకం కావడానికి పల్లెనిద్రలు తోడ్పడతాయన్నారు.

**పేద గాయకుడు కొండన్నకు ఇంటిస్థలం**

పెద్దగూడెం గ్రామానికి చెందిన పేద జానపద కళాకారుడు కొండన్నకు ఇంటి స్థలాన్ని కేటాయించారు. బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దగూడెం గ్రామంలో ఇళ్లు నిర్మించుకోవడానికి కేటాయించిన స్థలానికి సంబంధంచిన పత్రాలను మంత్రి అందజేశారు. దీంతో పాటు గత ఏడాది వనపర్తి జిల్లా గాంధినగర్‌కు చెందిన బిటెక్ విద్యార్థిని లావణ్య కళాశాల ఫీజు కట్టలేక ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయిస్తామని ఇచ్చిన మాట ప్రకారం లావణ్య తల్లి ఈశ్వరమ్మకు డబుల్ బెడ్‌రూం కేటాయించిన పత్రాలను మంత్రి అందజేశారు.

**టిఆర్ఎస్‌లో చేరికలు...**

పెబ్బేరు పట్టణం చెలిమిల్ల 5వ వార్డుకు బిజెపి నేతలు శంకరయ్య, నాగిరెడ్డి, కురుమూర్తి, రమేష్‌గౌడ్, నాగరాములతో సహా 30 మంది టిఆర్ఎస్ పార్టీలో చేరారు. వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టిఆర్ఎస్ కండువాలు కప్పి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.



మృతురాలు లావణ్య కుటుంబానికి డబుల్‌బెడ్ రూం ఇంటి పత్రాన్ని అందజేస్తున్న మంత్రి

## ప్రజల వద్దకే పాలన..!

**రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**



ప్రభుత్వ కార్యాలయాలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**నారాయణపేట, నవంబరు 30 ప్రభాతవార్త :** కొత్తగా ఏర్పడిన కొత్తపల్లి, గుండుమాల్ మండలాల కార్యాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ ప్రజల వద్దకే పాలనగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. జిల్లా ఏర్పడ్డ అతి తక్కువ సమయంలోనే మరో రెండు మండలాలతో 13 మండలాలు అయ్యాయన్నారు.కొత్తపల్లి,గుండుమాల్ సభలలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం బడుగు,బలహీన వర్గాల ఎదుగుదలకు కృషి చేస్తోందన్నారు. దేశంలోనే రైతుబంధు, రైతుభీమా ఇచ్చే ప్రభుత్వం ఏదైనా ఉంటే అది తెలంగాణ ప్రభుత్వమే అన్నారు. మండలాల ఏర్పాటు వలన వ్యాపారం, ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. నూతనంగా ఏర్పడిన మండలంలో వ్యవసాయ అధికారి కార్యాలయం, మండల తహసిల్దార్ కార్యాలయం, మండ ల విద్యాధికారి కార్యాలయాలను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ప్రారం భోత్సవ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు మాన్నె అరినోవస్‌రెడ్డి, జిల్లా జడ్పీ చైర్మన్ వనజమ్మ, జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష, అదనపు కలెక్టర్లు పద్మ జారాణి, స్థానిక ఎమ్మెల్యే పట్నం నరెందర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, ఎంపిపిలు,జడ్పీటిసిలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆధునిక యుగంలో ఆహార రంగమే అతిపెద్ద పరిశ్రమ..!

**వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉంది: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్,నవంబరు 30 ప్రభాతవార్త :** సమాజంలో రైతును గౌరవించినప్పుడే సమాజ అభ్యున్నతి సాధ్యమని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బిజినేపల్లి మండలం పాలెం వ్యవసాయ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన తెలంగాణ దక్షిణ మండల కిసాన్ మేళాలో వ్యవసాయ శాఖమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో ఆహార రంగమే అతిపెద్ద పరిశ్రమ అని పేర్కొన్నారు. సర్వ ప్రాణులకు ఆహారమే మొదటి ప్రాధాన్యమని ఆహారం లేకుండా ఏ జీవి బ్రతకజాలదన్నారు. అలాంటి ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్న రైతును గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. చాలా సంవత్సరాల తర్వాత పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కిసాన్‌మేళా నిర్వహించినట్లు వెల్లడించారు. పరిశోధనా ఫలాలు క్షేత్రస్థాయిలో రైతులకు చేరాలని, ఆ ఫలాలతో రైతులు అద్భుతమైన వ్యవసాయ ఉత్పత్తులు సాధించాలని ఆకాంక్షించారు. మానవ పరిణామ క్రమంలో గత 10,11 వేల ఏళ్లు కీలకమని, అంతకు ముందు అంతా స్థిరనివాసం లేని కాలమన్నారు. స్థిరనివాసం ఏర్పడిన తర్వాత వచ్చిన పరిశోధనలు, ఆవిష్కరణలు అత్యంత గొప్పవని పేర్కొన్నారు. ప్రతిరోజు భూమిమీద పుడుతున్న వారి సంఖ్య 2 లక్షలు, మరణిస్తున్న వారి సంఖ్య లక్ష అని, ప్రపంచ జనాభాకు అత్యంత ప్రాధాన్యం ఆహారమన్నారు. ప్రపంచ జనాభాకు సరిపడా ఆహారం సమకూర్చుకునేందుకు వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. భూమి సారాన్ని పెంచుకోవడంతో పాటు ఉత్పాదకతను పెంచుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయంలో సహజసిద్ధ ఎరువుల వినియోగం పెరిగిపోయిందన్నారు. రోజువారి అవసరాలకు అవసరమైన కూరగాయలు సైతం రైతు తన పంటచేలో పండించుకోవడం లేదన్నారు. ఏటా రెండుసార్లు భూసార పరీక్షలను విధిగా నిర్వహించాలని ఇందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు క్లస్టర్లవారిగా రైతులను చైతన్యపర్చాల్సిన అవసరం ఉందన్నారు. భూసార పరీక్షల ఫలితాలు వచ్చాక అధికారుల సూచనల మేరకు రైతులు ఎరువులను వినియోగిస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని, పంట దిగుబడి బాగా వస్తుందన్నారు.ఆధునిక వ్యవసాయ యంత్రాలు, నాణ్యమైన వంగడాలు తయారు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమ సంచాలకులు గోవర్ధన్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రైతులకు అవసరమైన నాణ్యమైన వంగడాలను అభివృద్ధి చేసిరైతులకు అందిస్తామన్నారు. ఇందుకు జునాగడ్, రాయచూర్, కదిరి, ట్రాంబే వ్యవసాయ పరిశోధనా కేంద్రాల నుండి నమూనా వంగడాలు సేకరించి వాటిని అభివృద్ధి చేసేందకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వేరుశనగ, ఆముదం, జొన్న, పశుగ్రాసం, విత్తనాలు మొదలగునవి మేలైన వంగడాలు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కోరమాండల్ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, డైరెక్టర్‌ఆఫ్ రీసెర్చ్ జగదీశ్వర్, ఆర్ఏసి శ్రీనివాస్, డా. సుధారాణి, స్థానిక సర్పంచ్ లావణ్యలు మాట్లాడారు. కార్యక్రమంలో బిజినేపల్లి ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్,ఉప్పునుంతల జడ్పీటిసి ప్రతాప్‌రెడ్డి, పదర జడ్పీటిసి రాంబాబు, వెంకటాపురం సర్పంచ్, ఖానాపూర్ ఎంపిటిసి రఘురామరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారులు, సైంటిస్టులు, రైతులు పాల్గొన్నారు.



రైతులు బహూకరించిన నాగలితో మంత్రి నిరంజన్‌రెడ్డి

## రాజకీయ పార్టీల సమక్షంలో గోవా ఎన్నికల అధికారుల బృందానికి ఈవీఎం, వీవీ ప్యాట్‌లను అందజేసిన జిల్లా అదనపు కలెక్టర్...



ఈవీఎం, వీవీ ప్యాట్ లను గోవా ఎన్నికల బృందానికి అందజేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్

**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 30 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వనపర్తి తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో ఈవీఎం గోదాములోని (288) ఈవీఎం, వీవీ ప్యాట్‌లను జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ బుధవారం అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో గోవా ఎన్నికల అధికారుల బృందానికి అందజేసే ప్రక్రియ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంట ఆర్డీఓ పద్మావతి, ఎలక్షన్ సూపరిండెంట్ రమేష్ రెడ్డి, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వృక్ష శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ జయంతి..

**ఖిల్లాఘణపురం,నవంబర్ 30 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో భౌతిక, జీవ, వృక్షశాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ జయంతి వేడుకలు బుధవారం సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ చంద్రబోస్ భారతదేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త మొక్కల్లో జీవం ఉంటుందని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. వృక్షశాస్త్రంలో గణనీయమైన ఫలితాలు సాధించారని రేడియో విజ్ఞానంలో పితామహునిగా పేరు పొందిన మహనీయుడని గుర్తు చేశారు. రేడియో సిగ్నల్స్ ను గుర్తించడానికి అర్ధవాహిక జంక్షన్లను మొట్టమొదటి సారిగి వాడినాడని తెలిపారు. వృక్ష,భౌతిక శాస్త్రంలో అద్భుతమైన ఆవిష్కరణలు చేశారని తాను రూపొందించిన పరికరం క్రెస్కోగ్రాఫ్ ను ఉపయోగించి వివిధ రకాలైన పరిస్థితులల్లో మొక్కలు ఎలా స్పందిస్తాయో పరిశోధనాత్మకంగా నిరూపించారని తెలిపారు. జంతువులు, వృక్షాల కణజాలాలలో సమాంతర ఆవిస్కరణలు చేశారని అన్నారు. దేశానికి ఎనలేని సేవలందించారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ గణేష్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య, పల్లాటి శ్రీనివాసులు, తుఫాన్ డ్రైవర్ల సంఘం అధ్యక్షులు దొరటి రమేష్, గ్రామ యువకులు పాల్గొన్నారు.


జగదీష్ చంద్రబోస్ కు ఘన నివాళి అర్పిస్తున్న యువకులు


## సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి..

**వనపర్తి టౌన్,నవంబర్ 30 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో నూతన మార్కెట్ యార్డ్‌లో టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్, పట్టణ అధ్యక్షులు రమేష్ గౌడ్ దడవాయి సంఘం, హమాలీ కూలీలకు, కేడీఆర్ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న 32వ వార్డు, 11వ వార్డు, రామాలయం, నందిహిల్స్, చాణిక్య స్కూల్ వార్డు ప్రాంతాల ప్రజలతో మహబూబ్‌నగర్ లో డిసెంబర్ 4వ తేదీన జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు తరలిరావాలని సమాయత్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి టీఆర్ఎస్ సోషల్ మీడియాఅధ్యక్షులు మాధవరావు సునీల్ వాల్మీకి, పరంజ్యోతి, ఆవుల రమేష్, రాష్ట్ర మార్కెట్ ఫెడ్ డైరెక్టర్ విజయ్, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


హమాలీలతో మాట్లాడుతున్న టీఆర్ఎస్ నాయకులు

## పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న సీఎం సహాయ నిధి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 30, ప్రభాతవార్త:**అనారోగ్య రీత్య మెరుగైన వైద్యం పొందలేని వారికి సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూరు మండల కేంద్రానికి చెందిన టి.రమేష్‌కు మంజూరైన రూ.24వేలు, కల్వకుర్తి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన తూర్పు వేమారెడ్డికి మంజూరైన రూ.60వేలు, పంజుగుల గ్రామానికి చెందిన నమీరా బేగంకు మంజూరైన రూ.14వేలు, అచ్చంపేట మండలం ఉటూకోనేరు గ్రామానికి చెందిన బెల్లి కార్తీక్‌కు మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీ పోతుగంటి రాములు క్యాంప్ ఆఫీస్‌లో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అపన్నహస్తంలా నిలిచిందన్నారు. వైద్యం పొంది ఆర్థిక ఇబ్బందులు కలుగకుండా పేద వారికి సీఎం సహాయ నిధి ఎంతో పారదర్శకంగా టీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి జెడ్పీటీసీ పోతుగంటి భరత్‌ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎంపీ రాములు

## కృష్ణ మండల నూతన తహసిల్దార్ (ఎఫ్ఎసి)గా బి. సురేష్

**మక్తల్,నవంబరు 30 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కృష్ణమండల నూతన తహసిల్దార్ (ఎఫ్ఎసి)గా బి. సురేష్ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసిల్దార్‌గా పనిచేసిన రామకోటి బదిలీపై మరికల్ మండలానికి వెళ్లగా ఇక్కడే నాయబ్ తహసిల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి. సురేష్‌ను ఆయన స్థానంలో నూతన తహసిల్దార్ (ఎఫ్ఎసి)గా నియమితులయ్యారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. తహసిల్దార్ మాట్లాడుతూ రైతులకు,ప్రజలకు ఏవైనా రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే ఎలాంటి పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.


తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బి. సురేష్

## విద్యార్థులు చట్టాలపై అవగాహన ఉండాలి

### ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహమద్ ఉమర్

**నారాయణపేట,నవంబరు 30 ప్రభాతవార్త :** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అందుకే పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహమద్ ఉమర్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం నారాయణపేట మోడెమ్ ఉన్నత పాఠశాల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయగా జూనియర్ సివిల్ జడ్జి పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగి ఉండాలని విద్యార్థులలో ఏ విధంగా ఆలోచనలు కార్యరూపం మార్చుకోవాలని అన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకుని చదవాలని మార్కులు తక్కువ వచ్చాయని, పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని క్షణికావేశానికి గురై అఘాయిత్యం చేసుకోవద్దని,మార్కుల కంటే జీవితం ఎంతో గొప్పదని హితవు పలికారు. చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండలని, క్షణికావేశంతో జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని వివరించారు. చదువుతో పాటు ఆరోగ్యం, మానసిక ఉల్లాసం ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో పిపి సురేష్‌కుమార్, జిల్లా షీటీం వసంత, తహసిల్దార్ దానయ్య, న్యాయవాది రఘువీర్ యాదవ్, ఫైజల్ అహ్మద్, మోహన్‌కుమార్, అలివేలమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మొహమద్ ఉమర్

## ప్రజల వద్దకే పాలన..!

### రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్





కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ (హాజరైన ప్రజలు, ప్రజాప్రతినిధులు)

# పరిపాలనా సౌలభ్యం కోసమే కొత్త మండలాల ఏర్పాటు..

### కౌకుంట్ల కొత్త మండలం ప్రారంభం.. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖమంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్

**దేవరకద్ర,నవంబరు 30 ప్రభాతవార్త :** దేవరకద్ర, పరిపాలనా సౌలభ్యం కోసమే ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసిందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దేవరకద్ర మండలంలోని కౌకుంట్లను మంగళవారం కొత్త మండలం ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ ఎస్.వెంకట్రావు ముఖ్య అతథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రసంగించారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతుందన్నారు. సమైక్య రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి సరైన కరెంటు, సాగునీరు అందక రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున వలసలు పోయేవారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, సాగునీటి లభ్యత వల్ల బంగారు పంటలు పండుతున్నాయన్నారు. దీంతో రైతులు, ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. దీనంతటికి ముఖ్యమంత్రి కెసిఆర్ చలవేనన్నారు. పెద్దఎత్తున చెక్‌డ్యాంలను నిర్మించుకుని నీటిని ప్రస్తుతం పొదుపు చేసుకోగలుగుతున్నామన్నారు. దీనివల్ల ఎండాకాలంలో కూడా పుష్కలంగా సాగునీరు లభిస్తుందన్నారు. ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి ప్రసంగిస్తూ సమైక్య రాష్ట్రంలో పదవులు అనుభవించిన తెలంగాణ నాయకులు ఇప్పుడు ప్రజలు పట్టించుకోకపోవడంతో జీర్ణించుకోలేక అనేక కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో పిండి సంచుల కోసం క్యూలైన్‌లో నిలబడిన 17 మంది మృత్యువాత పడ్డారన్నారు. తెలంగాణలో మాత్రం అన్నదాతలకు ఏ కష్టం లేకుండా ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచిందన్నారు. ధరలు పెంచుతూ పోతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాలకు సహకారం అందించకపోగా ఎంతో అభివృద్ధి చెందుతున్న తెలంగాణ లాంటి రాష్ట్రాలపై కుట్రలు చేస్తుందని విమర్శించారు. అట్టి కుట్రలను తెలంగాణ ప్రజలు తిప్పికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా కౌకుంట్లలో వ్యవసాయశాఖ, తహసిల్దార్, విద్యాశాఖ కార్యాలయాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రావు, తహసిల్దార్ జ్యోతిలతో పాటు జడ్పీటిసి అన్నపూర్ణ శ్రీకాంత్, ఎంపిపి రమాశ్రీకాంత్ యాదవ్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహారెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


దేవరకద్ర మండలం, కౌకుంట్లలో ప్రసంగిస్తున్నమంత్రి శ్రీనివాస్‌గౌడ్


మంత్రి, ఎంపి సమక్షంలో బాధ్యతలు తీసుకుంటున్న శివరాజ్

## తక్షణమే రిజిస్ట్రేషన్ సొంత భవనం ఏర్పాటు చేయాలి..

### అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్

**వనపర్తి టౌన్,నవంబర్ 30 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో ఉన్న రిజిస్ట్రేషన్ ఆఫీస్ ను తక్షణమే సొంత భవనంగా ఏర్పాటు చేయాలని అది కూడా జిల్లా కేంద్రం నడిబొడ్డులో ఉన్న పంచాయితీ రాజ్ ఆఫీస్‌లో ఏర్పాటు చేయాలని రియల్ ఎస్టేట్‌దారులు, అచలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్‌యాదవ్ మాట్లాడుతూ ఇరుకుగా ఉన్న మధ్య భవనంలో ఉన్న రిజిస్ట్రేషన్ ఆఫీస్‌ను సొంత భవనంలోకి తేవాలని గత కొంతకాలంగా మంత్రి నిరంజన్ రెడ్డి కి, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష లను విన్నవించుకోవడం జరిగిందని, కానీ ఇప్పుడు ఊరి బయట ఒక రియల్ ఎస్టేట్ వెనక వారికి ఉపయోగకరంగా ఉండే విధంగా రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఏర్పాటు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరికి ఉపయోగపడే, ప్రభుత్వానికి ఆర్థిక ఆదాయం తీసుకువచ్చే రిజిస్ట్రేషన్ ఆఫీస్ ను వనపర్తి నడిబొడ్డున ఖాళీగా ఉన్న పంచాయితీరాజ్ పాత ఆఫీసు దగ్గరనే భవనం నిర్మించాలని, దానికి ఆ స్థలం అనువుగా ఉందని, అక్కడే అన్ని సకల సౌకర్యాలు కల్పించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఊరికి దూరంగా నిర్మించవద్దని ప్రజలు చాలా అవస్థలు పడతారని ఆయన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష లను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అచలపక్ష ఐక్యవేదిక ఉపాధ్యక్షులు వెంటేష్వర్లు, జానంపేట రాములు, రమేష్, పొట్టినూనె గోపాలకృష్ణ నాయుడు, వైఎస్ఆర్‌టీపీ సతీష్, రియల్‌ఎస్టేట్ దారులు మర్రికుంట శాంతన్న, వస్యా నాయక్, బాలయ్య, సత్యనారాయణ గౌడ్, వెంకటసాగర్, బాలపీరు, ఎల్లయ్య, బాలస్వామి, యాదగిరి, మన్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి..

**అమరచింత,నవంబర్ 30 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఆర్యవైశ్యులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ఆర్యవైశ్య సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు కల్వరాజు, కొత్తకోట ఎంపీపీ గుంత మౌనిక, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు మోది మనోహరాజు అన్నారు. బుధవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం నూతన భవనాన్ని వాసవిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యులకు వ్యాపారపరంగా, ఆర్థిక సహాయం చేస్తామని అలాగే వెనుకబడిన విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తామని ఆయన తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని అమరచింత పట్టణంలో ప్రభుత్వ స్థలం కేటాయిస్తే శ్రీవాసవిమాత దేవాలయం నిర్మాణం చేస్తామని వారు తెలిపారు. అలాగే అమరచింత ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నాయకులను శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా కోశాధికారి విజయ్ కుమార్, బి.శ్రావణి, నాగయ్య శెట్టి, శేఖర్ శెట్టి, పరమేశ్వర్, జనార్దన్, వెంకటేష్, షైలేష్ శెట్టి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షులు మనోహర్ రాజు

## అఖిలభారత మహాసభల జయప్రదానికై జెండావిష్కరణ..

**వనపర్తి టౌన్,నవంబర్ 30 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ సూర్య ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ 17వ అచలభారత మహాసభలు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ అచల భారత కమిటీ పిలుపులో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని స్వాతంత్ర్య, ప్రజాస్వామ్యం, సోషలిజం, లక్ష్యాలనుగల జెండాను ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం.ఆది ఆవిష్కరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పాలకులు విద్యను అంగడి సరుకుగా మారుస్తున్నారని అనగారిన పేద వర్గాల విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారని విమర్శించారు. ఈ తరుణంలో డిసెంబర్ 13నుండి 16వరకు తెలంగాణ రాష్ట్రంలోని, ఉస్మానియా యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ అచలభారత 17వ మహాసభలు నిర్వహించడం జరుగుతుందని ఈ మహాసభల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు విద్యార్థి ఉద్యమ కార్యచరణను రూపొందించుకోవడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగానే మహాసభల సయప్రదానికై జెండావిష్కరణ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు నాయుడు, మల్లేష్, సాయి, కృష్ణుడు, అజిత్, రాజశేఖర్, రాఘవేంద్ర, ఉపేందర్, శివ, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎస్ఎఫ్ఐ అఖిలభారత మహాసభల జయప్రదానికై జెండావిష్కరణ చేస్తున్న జిల్లా కార్యదర్శి ఎం.ఆదిల

## తెలంగాణ రైతు సంఘం

### రాష్ట్ర కమిటీ సభ్యులుగా జీ.ఎస్.గోపి ఎన్నిక..

**అమరచింత,నవంబర్30 ప్రభాతవార్త:** నల్గొండజిల్లాలో 3రోజులపాటు జరిగిన తెలంగాణ రాష్ట్ర రైతు మహాసభలు ఈ మహాసభలలో అమరచింత పట్టణానికి చెందిన మున్సిపల్ వైస్ చైర్మెన్ జీ.ఎస్ గోపిని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కమిటీ సభ్యులుగా ఎన్నికైనా సందర్భంగా వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.రాజు, వ్యవసాయ కార్మిక జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.అజయ్, రైతు సంఘం జిల్లా నాయకులు బి.వెంకటేష్, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.ఎన్ రమేష్, బుచ్చన్న, శ్యామ్‌సుందర్, హర్షం వ్యక్తం చేశారు.



## కృష్ణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ..!

**మొదటిపేజీ తరువాయి..**

అందరికి సమన్యాయం అందేలా చూడాలని, బాధితులు తీసుకువచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచరాదని సూచించారు. ఒకవేళ ఫిర్యాదు పెండింగ్‌లో ఉంటే ఫిర్యాదుకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు బాధితులకు తెలుపుతూ ఉండాలని, ప్రజలకు పూర్తి భద్రత,భరోసా కల్పించాలని సూచించారు. కృష్ణ పోలీస్ స్టేషన్ కర్ణాటక బార్డర్‌లో ఉన్నందున ప్రతిరోజు వాహనాల తనిఖీలు నిర్వహించాలని అలాగే అనుమానిత వ్యక్తులను ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు చేయాలని, బార్డర్ చెక్‌పోస్టు దగ్గర అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వరి ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో జిల్లాలోకి అనుమతించరాదని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ ఫైల్స్‌ను తనిఖీ నిర్వహించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగిన పూర్తిచేయాలని సూచించారు. వర్టికల్స్ నిర్వహణ, హెచ్‌ఆర్ఎంఎస్, ఆన్‌లైన్ వినియోగించే విధానం, టిఎస్ కాప్స్ ఆన్‌లైన్‌లో కేసుల వివరాలు నమోదు చేసే మొదలగు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటిషన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సాంకేతికంగా ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు సిసి కెమెరాలపై అవగాహన కల్పించి, ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని,అలాగే సైబర్ నేరాలపట్ల సైబర్ నేరగాళ్లను చూపి మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పర్చాలని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో చెట్లునాటారు. కార్యక్రమంలో మక్తల్ సిఐ సీతయ్య, ఎస్సై విజయభాస్కర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

# ఇన్‌చార్జి జెడ్పీచైర్మన్‌కు మంత్రుల అభినందనలు...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,నవంబర్30, ప్రభాతవార్త:**నూతనంగా జెడ్పీ చైర్మన్‌గా ఎన్నిక కాబడిన చారకొండ మండల జెడ్పీటీసీ ఠాకూర్ బాలాజీసింగ్‌కు రాష్ట్ర మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డిలు అభినందనలు అందించారు. జెడ్పీచైర్మన్‌గా నియమించడంతో ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రులు, సహకరించిన ఎమ్మెల్యేకు, నాయకులకు ఠాకూర్ బాలాజీసింగ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో జెడ్పీచైర్మన్ పదవి అప్పగించినందుకు జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ అధికారులతో సమన్వయం ఏర్పరుచుకొని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రైతు, ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వాటిని తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్‌ను సన్మానించిన వారిలో పెద్దాపూర్ సర్పంచ్ గోరటి శ్రీనివాస్, సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, రైతు సంఘం కన్వీనర్ రూపం వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుభాష్, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, ఆమనగల్లు మున్సిపాలిటి కార్యదర్శి వడ్డెమోని శివకుమార్, ధర్మనాయక్, శత్రునాయక్, బన్నె శేఖర్, సురమల్ల చెన్నయ్య, బరిగెల రాములు, మహేష్, సుమన్‌నాయక్, వినోద్‌నాయక్, గణేష్, చింటూ తదితరులు ఉన్నారు.


ఇన్‌చార్జి జెడ్పీచైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌ను అభినందిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి


ఇన్‌చార్జి జెడ్పీచైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌ను అభినందిస్తున్న టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి

## చిరుతపులి దాడిలో ఐదు గొర్రెలు మృతి

**లింగాల,నవంబరు 30 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎంసి తండా గ్రామ శివారులోని అడ్డగట్టు (చెన్నగుట్ట) సమీపంలో ఐదు గొర్రెలు మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. బాధితురాలు కేతావత్ పార్వతి తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మంగళవారం గొర్రెల మందను తీసుకుని గ్రామ సమీపంలోని అడ్డగట్టుకు మేపడానికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి గొర్రెల మందలో గొర్రెలు తక్కువ కనిపించాయని తెలిపారు. ఈ విషయంపై అటవి శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు అక్కడికి వెళ్లి చూడగా 5 గొర్రెల కళేబరాలు కనిపించాయని తెలిపారు. మృతి చెందిన గొర్రెల విలువ దాదాపుగా రూ. 50 వేలు తెలిపారు. ఈ సంఘటనపై బీట్ అధికారి ఖాదర్ పాషాను వివరణ కోరగా అటవి ప్రాంతంలో చిరుతపులులు సంచరిస్తున్నాయని తెలిపారు. అటవి ప్రాంతంలోకి అటవిశాఖ అధికారుల అనుమతులు లేకుండా వెళ్లకూడదని ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని తెలిపారు. మృతి చెందిన గొర్రెలకు ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు.


చిరుతపులి దాడిలో మృతి చెందిన గొర్రెలు

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**లింగాల,నవంబరు 30 ప్రభాతవార్త :** మండలంలోని కొత్తకుంటపల్లి గ్రామానికి చెందిన ఎర్ర వెంకటస్వామి (55) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మృతుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడని తెలిపారు. మృతుడు అనారోగ్యంతో ఉంటూ మద్యం సేవించేవాడని తెలిపారు. మృతుని భార్య మద్యం సేవించకూడదని ప్రతిరోజు మందలించేదని తెలిపారు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ రాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టు పక్కల వారు గమనించి మృతుని భార్యకు సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.


కొత్తకుంటపల్లి గ్రామంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఎర్ర వెంకటస్వామి

# శాస్త్ర సాంకేతిక రంగంలో దూసుకెళ్తున్న తెలంగాణ

## ● వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



వ్యవసాయ భూసార పరీక్ష భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 30, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనుకబడిన తెలంగాణ... నేడు సీఎం కేసీఆర్ నేతృత్వంలో శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తుందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయంలో భూసార పరీక్ష కేంద్ర భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి గద్వాల్ ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, అడిషనల్ కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించి వ్యవసాయాన్ని ఆధునీకరణ పద్ధతుల ద్వారా సాగు చేసి పంట ఎగుమతులను సైతం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు. విశ్వ విద్యాలయాలను ఏర్పాటు చేసి మన ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. విద్యలో వెనుకబడిన ప్రాంతంగా ఉండే తెలంగాణ ప్రాంతం నేడు అన్ని రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణ విద్య వ్యవస్థపై చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం దక్షిణ తెలంగాణ మండల కిసాన్ మేళా 2022 కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయ శాఖకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు తదితరులు ఉన్నారు.



కిసాన్ మేళా 2022 వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్య

# పల్లె నిద్ర కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి



నాగసానిపల్లిలో పల్లెనిద్ర కార్యక్రమానికి వస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి

**శ్రీరంగాపురం, నవంబర్ 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగసానిపల్లి గ్రామంలో బుధవారం మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ నేతృత్వంలో గ్రామస్థులు, తెరాస పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా గ్రామంలోని పలు సమస్యలనుతెలుసుకున్న మంత్రి పరిష్కారినికి కృసి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధిలో వెనుకబడిన గ్రామాల్లో మంత్రి పల్లెనిద్రతో క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలు గుర్తిస్తారు. తన వెంట అధికారులు పర్యటించడం వల్ల పరిస్థితులు మెరుగుపడతాయని మంత్రి భావిస్తున్నారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారినికే అని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఆయన గ్రామంలో మార్నింగ్ వాక్ చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలనుతెలుసుకొనేందుకు పల్లెనిద్ర ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణలో సాగునీరు పుష్కలంగా లభిస్తుందని ఫలితంగా గతంలో ఉపాధిలేక వలన వెళ్లినవారు నేడు సొంతూళ్లకు తిరిగి వస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయిత్రి పృధ్వీరాజ్, నాగసానిపల్లి సర్పంచ్ ఆంజనేయులు, రైతు బంధు అధ్యక్షులు గౌడ్ నాయక్, తెరాస మండల అధ్యక్షులు ఆర్.వెంకటస్వామి, నాగసానిపల్లి ఉపసర్పంచ్ సుజాత, వనపర్తి గొర్రెల కాపరుల డైరెక్టర్ రాజు యాదవ్, తెరాస పార్టీ సీనియర్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంఛార్జ్ జెడ్పీ చైర్మన్‌కు ఘన సన్మానం



ఇంఛార్జ్ జెడ్పీ చైర్మన్‌ను సన్మానిస్తున్న జక్కుల చిన్న జంగయ్యయాదవ్

**వెల్దండ, నవంబర్30, ప్రభాతవార్త:** నూతన జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఠాకూర్ బాలాజీసింగ్‌ను జీయాగూడ యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్యయాదవ్, టీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు వావిళ్ల సంజీవ్‌కుమార్‌యాదవ్, మండల మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం వెల్దండ మండల కేంద్రంలో పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాలాజీ అభిమానులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్ది రామకృష్ణ, టీఆర్ఎస్ పార్టీ నాయకులు గోపాల్‌నాయక్, రమేష్‌గౌడ్, కాలే వెంకటేష్, తిర్మల్ రావు,నారాయణనాయక్, సురేష్,యాదవ సంఘంమండల అధ్యక్షులు రాజు యాదవ్,రవిందర్‌యాదవ్,కుమార్‌యాదవ్, మహేష్,వెంకటేష్ ముదిరాజ్, శ్రీను,సద్దాం, అల్లాజీతో పాటు తదితరులు ఉన్నారు.

# నర్సరీలో మొక్కలు నాటడానికి అన్ని ఏర్పాట్లు త్వరలో పూర్తి చేయాలి

**పెద్దమందడి,నవంబర్30 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొక్కలు నాటడానికి హరితహారం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని దానిలో భాగంగా వచ్చే ఏడాదికి మొక్కలు నాటడానికి అన్ని గ్రామాల్లో నర్సరీలను త్వరలోనే పూర్తి చేయాలని ఎంపీడీఓ అఫ్జల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని జంగమాయిపల్లి, బలిజపల్లి, పామిరెడ్డిపల్లి, ముందరి తాండా, దొడగుంటపల్లి గ్రామాలలో నర్సరీలను ఎంపీడీఓ అఫ్జల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ప్రతినర్సరీలో 10వేల మొక్కలు పెంచడానికి అన్ని ఏర్పాట్లు త్వరలోనే పూర్తి చేయాలని అన్నారు. గ్రామాలలో పారిశుద్య చర్యలు చేపట్టాలని అన్నారు.గ్రామం పరిశుభ్రంగాఉంటే గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. గ్రామాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# జర్నలిస్టు మల్లేష్‌కు ఆర్థిక సాయం



మల్లేష్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, నవంబర్ 30, ప్రభాతవార్త:** ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న జరల్నిస్టు మల్లేష్‌ను బుధవారంజర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మల్లేష్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అసోసియేషన్ తరుపు నుంచి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.కార్యక్రమంలో అధ్యక్షులు రాంచందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఏ ఆపద వచ్చిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బాలయ్య, కార్యదర్శి రాజన్న, కోశాధికారి కార్తీక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# గ్రామాలలో ప్రజలు కలిసిమెలిసి నడవాలి



సాసనూలు గ్రామంలో పౌరహక్కుల దినోత్సవంలో ప్రజలకు వివరిస్తున్న అధికారులు

**ఇటిక్యాల,నవంబరు 30 ప్రభాతవార్త:** గ్రామాలలో అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్ ప్రజలకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని సాసనూలు గ్రామంలో పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్, సర్పంచ్ మల్లన్న, పంచాయతీ కార్యదర్శి కౌసల్య, పౌరహక్కుల దినోత్సవంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో అన్నివర్గాల ప్రజలు సోదరభావంతో మెలగాలని దళితులను చిన్నచూపు చూడరాదని, అన్నింటిలో దళితులను కలుపుకుపోవాలని, హోటళ్లలో రెండుగ్లాసుల పద్దతి వంటివి ఉండరాదని, దళితులను చిన్నచూపు చూస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్ గ్రామ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్థర్, ఎఎన్‌ఎం జానమ్మ, ఆర్ కార్యకర్త పద్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తొలగించని పైలాన్‌ను రోడ్డు పక్కకే ఏర్పాటు చేయాలి

**వనపర్తి టౌన్,నవంబర్ 30 ప్రభాతవార్త:** రామన్‌పాడు మంచినీటి శంకుస్థాపన ప్రారంభ పైలాన్ తొలగించిన పక్కకే ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షులు నందిమల్ల అశోక్ మాట్లాడుతూ చంద్రబాబు, రావుల చంద్రశేఖర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్దిని మరిపించేందు టీఆర్ఎస్ కుట్ర వనపర్తి ప్రజలకు మంచినీరు అందించేందుకు ఆనాడు చంద్రశేఖర్‌రెడ్డి రెండవ రామన్‌పాడు మంచినీటి పథకం సాధించి, ప్రారంభించి అంబేద్కర్ చౌరస్తాలో పైలాన్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రోడ్ల విస్తరణలో భాగంగా ఆ పైలాన్‌ను తొలగిస్తామని చైర్మెన్, అదికారులు మా దృష్టికి తీసుకువచ్చారని కానీ అట్టి పథకం చారిత్రాత్మక అభివృద్ధికి నిదర్శనం అని ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడి నుండి మార్చవద్దని గతంలో కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని కానీ ఏకపక్షంగాఎటువంటి సమాచారం లేకుండా పైలాన్ తొల గించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు. రోడ్ల విస్తరణ కోసం మేము సహకరిస్తమని కమిసనర్ కు చెప్పిన సమాచారం ఇవ్వకుండా తొలగించడం నియంతృత్వ పోకడాలకు నిదర్శనం అని అన్నారు. పైలాన్ విషయంలో చైర్మెన్ ని ప్రశ్నించగా సీఎం ప్రోగ్రాం తరువాత అదే ప్రాంతంలో ప్రతిష్టిస్తామని మాపీ ఇచ్చారు. హామీ ని నిలుపుకోవాలని పైలాన్ నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మేమే పాత స్థలంలోనే నిర్మిస్తామని ఆయన హెచ్చరించారు.



పైలాన్ తొలగించిన స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ అధ్యక్షులు నందిమల్ల అశోక్

# బిజెపి బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

## ■ అలంపూర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మెడికల్ తిరుమలరెడ్డి

**ఇటిక్యాల,నవంబరు 30 ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల నేపథ్యంలో బిజెపి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బిజెపి పార్టీ అలంపూర్ అసెంబ్లీ కన్వీనర్ మెడకల్ తిరుమలరెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో బిజెపి మండల అధ్యక్షులు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా అలంపూర్ కన్వీనర్ మెడికల్ తిరుమల్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రం బిజెపి ప్రభుత్వం ప్రతి గ్రామంలో కేంద్ర నిధులతోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని కార్యక్తలకు సూచించారు. అంతేకాక మండల పరిధిలోని తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని అదేవిధంగా అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు కాలేదని రేషన్ కార్డులు, పింఛన్లు అందక పేద ప్రజలు అవస్థలు పడుతున్నారని అర్హులైన వారికి వెంటనే తెలంగాణ ప్రభుత్వంపై సమస్యలను పరిష్కరించాలని లేనిచో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. మండలంలోని పోలింగ్ బూత్ కమిటీలు, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బిజెపి పార్టీ కార్యకర్తలు సిద్ధమై కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ సిద్ధాంతాలు నచ్చి కొంతమంది పార్టీలో చేరినట్లు వారు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కెకెరెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్, జిల్లా కార్యవర్గ సభ్యులు తిమ్మారెడ్డి, జిల్లా బిజెవైఎం ఉపాధ్యక్షులు కిశోర్, బిజెవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవి, మద్దిలేటి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు ఎల్లారెడ్డి, బిజెవైఎం ఉపాధ్యక్షులు మునిందర్‌రెడ్డి, పోలింగ్ బూత్ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు మహేష్, బీసన్న, బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.



బిజెపి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న నాయకులు

# పాలమూరులో కేసీఆర్ బహిరంగ సభ విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రైతు బంధు అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి

పెద్దమందడి,నవంబర్ 30 ప్రభాతవార్త: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 4వ తేదీన ఆదివారం కేసీఆర్ బహిరంగ సభ విజయవంతం చేయాలని జిల్లా రైతు బంధు అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, జడ్పీటీసీ రఘుపతి రెడ్డి అన్నారు. బుధవారం పెద్దమందడి మండల కేంద్రంలోని జగదీశ్వర్ రెడ్డి నివాసంలో ముఖ్య టీఆర్ఎస్ కార్యకర్తల, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు బంధు అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, జడ్పీటీసీ రఘుపతి రెడ్డి మాట్లాడుతూ పెద్దమందడి మండలం నుండి 3వేల మందిని బహిరంగ సభకు తరలివస్తున్నామని వారు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగసభకు మండలంలోని వివిధ గ్రామ నుండి భారీ ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలనివారు అన్నారు. గ్రామంలోని ముఖ్య టీఆర్ఎస్ కార్యకర్తలు టీఆర్ఎస్ పార్టీకి సంబందించిన సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య కార్యకర్తలు గ్రామ రైతు కమిటీ అధ్యక్షులు అధిక సంఖ్యలో రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలోని పెద్దమందడి మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వేణు యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షులు విష్ణువర్దన్ రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు సత్యారెడ్డి, మాజీ జడ్పీటీసీ వెంకటస్వామి, మాజీ ఎంపీపీ మన్నెపు రెడ్డి, జిల్లా గొర్రెల సంఘం డైరెక్టర్ నాగేంద్ర యాదవ్, సింగిల్‌విండో ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, మండల టీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు రామకృష్ణా రెడ్డి, పెద్దమందడి టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చలపతి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు శివశంకర్, మండల రైతు కమిటీ అధ్యక్షులు కొండ రవీందర్ రెడ్డి, కొన్నూరు శ్రీనివాస్ రెడ్డొ, కొర్రపాటి సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూములపై పోరాటం

## - కల్వకుర్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా



ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కల్వకుర్తి, నవంబర్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతులు అటవీ ప్రాంతాల్లో సాగు చేసుకుంటున్న భూమి రైతులకు దక్కకుండా అధికారులు లాక్కొని రైతులకు అన్యాయం చేస్తున్నారనే నెపంతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు బుధవారం కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్‌లు హజరై మాట్లాడారు. రాష్ట్రంలో రైతు సమస్యలపై పోరుబాటకై కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని, ఈ నెల 21 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు విడతల వారిగా పోడు భూములపై మండల కేంద్రాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో, జిల్లా కేంద్రంలో ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.పోడు భూములు,ధాన్యం కొనుగోలు, ధరణి, రైతు రుణమాఫీ, రైతు బంధు,రైతు భీమా,వ్యవసాయం, రైతులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులసమస్యల పరిష్కారం చేస్తున్నామంటూ రైతులను నట్టేట ముంచుతూ రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించకుండా దళారి వ్యవస్థను రూపొందించి రైతుల పొట్టకొట్టి దళారుల జేబులు నింపేందుకు ప్రయత్నం చేస్తుందని తెలిపారు. పోడు భూములపై పూర్తిహక్కు సాగు చేస్తున్న రైతులకే కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేయడంతో పాటు రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని తెలిపారు. వరంగల్ డిక్లరేషన్‌ను ఖచ్చితంగా అమలుచేస్తామని తెలిపారు. కార్యక్రమకంలో టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, మల్లెపల్లి జగన్, రోహిణి గోవర్ధన్‌రెడ్డి, బిక్యనాయక్, రాము,యాట నర్సింహ్మా,రాములునాయక్,మోతిలాల్‌నాయక్,గుజ్జలమహేష్, మట్ట వెంకటయ్య, పాండుగౌడ్, ఎల్లమ్మ, మోహన్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అనిల్‌గౌడ్, బాలరాజు, శ్రీనివాస్, హీరాసింగ్, చంద్రకాంత్‌రెడ్డి, కృష్ణనాయక్, శేఖర్, ఎర్ర శ్రీను, అజీమ్, వంశీ,శ్రీహరి,మిర్యాల దామోదర్‌రెడ్డి, పుల్లయ్య, ఇస్తారి, రవి, కరణ్, దాస్యనాయక్, రమేష్, కొండల్, శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ ఉన్నారు.

# మలిదశ ఉద్యమంలో మృతి చెందిన కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతి వేడుకలు

**వెల్దండ, నవంబర్ 30, ప్రభాతవార్త:** తెలంగాణ తొలి అమర వీరుడు, పోలీస్ కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతి వేడుకలను మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు మత్స్యకార సంఘం మండల అధ్యక్షులు క్యాసరపు వెంకటయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షులు అన్నెపు వెంకటేష్ ముదిరాజ్‌లు తెలిపారు. బుధవారం వెల్దండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అమరుడైన పోలీస్ కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ 13వ వర్ధంతిని మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఘనంగా నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి ముదిరాజ్ బంధువులు, సోదరులు అధిక సంఖ్యలో విజయవంతమైకార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో భయ్య మల్లయ్య ముదిరాజ్, ఉప సర్పంచ్ నర్సింహ్మా ముదిరాజ్, మాసుల బాలరాజు, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యకార సంఘం మండల అధ్యక్షులు క్యాసరపు వెంకటయ్య